దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావం

ఎన్‌సీసీతో రాటుదేలుతున్న విద్యార్థులు

- ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్‌లో ఎన్‌సీసీ యూనిట్
- విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేలా శిక్షణ

విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో నేషనల్ క్యాడెట్ కార్ప్స్(ఎన్‌సీసీ) ఎంతో ప్రత్యేకమైన గుర్తింపు పొందింది. స్టూడెంట్లను పాఠశాల దశ నుంచే సైన్యంలో చేరేలా ప్రోత్సహించడం, యువతను క్రమశిక్షణ, దేశభక్తి గల పౌరులుగా మలచడమే ఎన్‌సీసీ ఉద్దేశం. యువతలో సైన్యంపై అవగాహన కల్పించేందుకు, సైనిక స్థాయిలో వారిని సిద్ధం చేసేందుకు 1948లో ఎన్‌సీసీ ఏర్పడింది. స్వాతంత్ర్యానంతరం ఏర్పాటైన పండిట్ హెచ్ఎన్ కుంజ్రూ కమిటీ పాఠశాల, కళాశాల స్థాయిలో క్యాడెట్ సంస్థను ఏర్పాటు చేయాలని సూచించింది. ఆ విధంగా దేశంలో హైస్కూల్, కళాశాల స్థాయిలో చురుగ్గా, ఆరోగ్యవంతంగా ఉన్న యువతను ఎంపిక చేసి ఎన్‌సీసీ శిక్షణ ఇస్తున్నారు.

సీతంపేట: విశాఖలో మొట్టమొదటిగా 26వ వార్డు అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్‌లో ఎన్‌సీసీ నిర్వహించేందుకు నేషనల్ క్యాడెట్ కార్ప్స్ డైరెక్టరేట్ ఆమోదించింది. దీంతో గతేడాది ఈ పాఠశాలలో ఎన్‌సీసీ యూనిట్ ప్రారంభించారు. ఎన్‌సీసీ శిక్షణతో విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఐకమత్యం అలవడుతుందని, మానసిక, శారీరక ధారుఢ్యం కలుగుతుందని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలో ఎన్‌సీసీ నిర్వహణకు అనుమతుల సాధనకు ఇక్కడ పనిచేస్తున్న తెలుగు ఉపాధ్యాయుడు, ఎన్‌సీసీ కమాండర్ ఎం.ఎస్.వి.విశ్వనాథం ముఖ్య పాత్ర పోషించారు. గతంలో ఆయన విశాఖపట్నం జేడీ ఆఫీసర్‌గా పనిచేసే సమయంలో ఎనిమిది అవార్డులు సాధించారు. ఎన్‌సీసీ ఉన్నతాధికారులతో ఉన్న సత్సంబంధాల వల్ల ప్రస్తుత ఎన్‌సీసీ ఆర్మీ కమాండర్ అజయ్‌కుమార్ ద్వారా ఢిల్లీలోని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి జీవీఎంసీ పాఠశాలలో ఎన్‌సీసీ నిర్వహణకు అనుమతులు పొందారు.


కవాతు చేస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్లు

రెండేళ్ల శిక్షణ

ఎన్‌సీసీ కోర్సు పాఠశాల స్థాయిలో రెండేళ్ల పాటు శిక్షణ తీసుకోవాల్సి ఉంది. మొదటి ఏడాది పాఠశాల స్థాయిలోను, రెండో ఏడాది పాఠశాల స్థాయితో పాటు వివిధ ట్రైనింగ్ క్యాంపులకు హాజరు కావడం, ఆర్మీలో నిర్దేశించిన డ్రిల్, మ్యాప్ రీడింగ్, వెపన్ ట్రైనింగ్ సంబంధించిన విషయాల్లో శిక్షణ ఇస్తారు. అనంతరం 375 మార్కులకు మూడు గంటల వ్యవధిలో రాత పరీక్ష, 125 మార్కులకు మౌఖిక పరీక్ష ఉంటాయి. పాఠశాల స్థాయిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు 'ఏ' సర్టిఫికెట్ ఇస్తారు. వారి వారి సామర్థ్యాలను బట్టి వేరు వేరు గ్రేడ్‌లు కేటాయిస్తారు. వీటి ద్వారా తదుపరి ఉన్నత చదువులు, ఉద్యోగాల్లో ప్రాధాన్యం లభిస్తుంది.

50 మంది ఎంపిక

పాఠశాలలో చదువుతున్న 50 మంది విద్యార్థులను ఎన్‌సీసీ శిక్షణకు ఎంపిక చేశారు. 8, 9 తరగతి విద్యార్థులకు రన్నింగ్, పుషప్స్, సిట్ అప్స్ పోటీలు నిర్వహించి శారీరక ధారుఢ్యం ఉన్న 50 మందిని ఎంపిక చేసి శిక్షణ ఇస్తున్నారు. 2023–24లో ఇద్దరు విద్యార్థినులు ఊటీ క్యాంప్, మరో ముగ్గురు ఫైరింగ్ కాంపిటేషన్ పెద్దాపురం, మరో 21 మంది విజయనగరంలో జరిగిన సీఏటీసీ క్యాంప్‌లో పాల్గొని ప్రతిభ చూపారు.


ఎన్‌సీసీ శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు

ఎన్‌సీసీతో ప్రయోజనాలు

టీచర్, రైల్వే, పోలీస్, ఆర్మీ, బ్యాంక్, ప్రైవేట్, ప్రభుత్వ రంగాల్లో ఉద్యోగాల్లో ఎన్‌సీసీ సర్టిఫికెట్ ఉన్న వారికి గ్రేడ్‌ల బట్టి ప్రత్యేక కోటా, ప్రాధాన్యం ఇస్తారు. ఎన్‌సీసీ సర్టిఫికెట్ ఉన్న వారికి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రాధాన్యం ఉంటుంది.


ఫైరింగ్‌లో శిక్షణ

ఎన్‌సీసీలో శిక్షణ.. విద్యార్థులకు వరం



ఎన్‌సీసీ ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఐకమత్యం, దేశభక్తి, మానసిక, శారీరక ధారుఢ్యం పెంపొందుతాయి. ప్రభుత్వ ఉద్యోగాల్లో ఎన్‌సీసీ సర్టిఫికెట్ ఉన్న వారికి ప్రాధాన్యం లభిస్తుంది. ఇప్పటి వరకు జీవీఎంసీ పాఠశాలల్లో ఎన్‌సీసీ నిర్వహించ లేదు. మొదటి సారి ఎన్జీజీవోస్ కాలనీ హైస్కూల్‌లో ఎన్‌సీసీ నిర్వహణకు డైరెక్టరేట్ ఆమోదిందించి. భవిష్యత్‌లో ఎన్‌సీసీని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తాను. – ఎం.ఎస్.వి.విశ్వనాథం, ఎన్‌సీసీ కమాండర్

విద్యార్థులు క్రమశిక్షణతో రాణిస్తున్నారు



గత రెండేళ్లుగా మా పాఠశాలలో 50 మంది విద్యార్థులకు ఎన్‌సీసీలో శిక్షణ ఇస్తున్నాం. విద్యార్థులు క్రమశిక్షణ, శారీరక, మానసిక దృఢత్వంతో రాణిస్తున్నారు. విశాఖ నగరంలో తమ పాఠశాలకు ఎన్‌సీసీ ఉండటం చాలా ఆనందంగా ఉంది.
– బి.లక్ష్మీనరస, ప్రధానోపాధ్యాయిని, ఎన్జీజీవోస్ కాలనీ హైస్కూల్

క్లుప్తంగా

శాకంబరిగా లలితాదేవి


శాకంబరి అలంకరణలో లలితా కామేశ్వరి

సీతంపేట: ఆషాఢ మాసం బహుళ తదియ సందర్భంగా బుధవారం లలితానగర్ శ్రీలలితా పీఠంలోని లలితా కామేశ్వరి అమ్మవారు శాకంబరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పలు రకాల కూరగాయలతో అమ్మవారిని, ఆలయ ప్రాంగణాన్ని చూడముచ్చటగా అలంకరించారు. ఉదయం నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. పీఠం మేనేజర్ మన్నం కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఎరుకుమాంబకు జలాభిషేకం


అమ్మవారికి జలాభిషేకం చేస్తున్న ఈవో రమాబాయి, భక్తులు

సీతమ్మధార: దొండపర్తిలో వెలసిన శ్రీఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం ఉదయం ఈవో రమాబాయి ఆధ్వర్యంలో గణపతి పూజ చేశారు. అనంతరం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి భక్తులు స్వయంగా జలాభిషేకం చేశారు. అర్చకుడు శ్రీనివాస్ భక్తుల గోత్రనామాలతో విశేష పూజలు జరిపారు. సాయంత్రం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి దర్శనం కల్పించారు. సాయంత్రం కూడా అమ్మవారికి భక్తులు జలాభిషేకం చేశారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు. ఆలయ సిబ్బంది, పాల్గొన్నారు.

అపార్ట్‌మెంట్‌లో కొండచిలువ హల్‌చల్


ఆరిలోవ హిల్‌వ్యూ అపార్ట్‌మెంట్ షెల్లార్‌లో తిరుగుతున్న కొండచిలువ

ఆరిలోవ: అర్ధరాత్రి వేళ ఆరిలోవలోని ఓ అపార్ట్‌మెంట్‌లో కొండచిలువ హల్‌చల్ చేసింది. వివరాలిలా.. అంబేడ్కర్ కూడలి సమీప హిల్‌వ్యూ అపార్ట్‌మెంట్ షెల్లార్‌లో మంగళవారం అర్ధరాత్రి 2 గంటల సమయంలో తిరుగుతున్న కొండచిలువను వాచ్‌మన్ ప్రసాద్, అక్కడున్న ఓ ఆటో డ్రైవర్ చూశారు. ఇద్దరూ అపార్ట్‌మెంట్‌లో ఉన్న వారిని అప్రమత్తం చేశారు. సుమారు 6 అడుగుల పొడవున్న ఆ కొండచిలువను చూసిన నివాసులు ఆందోళన చెందారు. పోలీసులు, స్నేక్ క్యాచర్‌కు సమాచారం అందించారు. వారు వచ్చేసరికి సమయం పట్టడంతో స్థానికుల్లో కొందరు ధైర్యం చేసి ఆ కొండచిలువను చాకచక్యంగా పట్టుకుని గోనెసంచిలో బంధించారు. అనంతరం దాన్ని ఇందిరా గాంధీ జూ పార్కుకు అప్పగించారు.

27 నుంచి ఐసీహెచ్ క్యాంటీన్ల మూత

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లోని ఇండియన్ కాఫీ హౌస్(ఐసీహెచ్) క్యాంటీన్లు ఈ నెల 27 నుంచి మూతపడనున్నాయి. ఈ మేరకు ఉక్కు వెల్ఫేర్ విభాగానికి లేఖ అందజేశారు. స్టీల్‌ప్లాంట్‌లోని అన్ని విభాగాల్లో యాజమాన్యం ఆధ్వర్యంలో క్యాంటీన్లు నిర్వహిస్తున్నారు. ఈడీ (వర్క్స్) బిల్డింగ్ వెనుక ఉన్న కెఫెటేరియాతోపాటు కొన్ని విభాగాల్లో మరో నాలుగు నడుస్తున్నాయి. కొన్ని నెలలుగా మొత్తం ఐదు క్యాంటీన్లకు సుమారు రూ.3 కోట్లు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. యాజమాన్యం బిల్లుల చెల్లింపులు జరపకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఐసీహెచ్ ప్రతినిధి తెలిపారు.

అర్బన్ తహసీల్దార్‌కు ఘనంగా వీడ్కోలు

సీతమ్మధార: తోటి ఉద్యోగులందరి సహకారంతో 2024 సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించినట్లు సీతమ్మధార అర్బన్ మండల తహసీల్దార్ గొట్టాపు శ్రీరామ్మూర్తి అన్నారు. ఈ ఏడాది ఎన్నికల బదిలీల్లో భాగంగా పార్వతీపురం నుంచి సీతమ్మధారకు తహసీల్దార్‌గా ఆయన వచ్చారు. ఎన్నికలు పూర్తి కావడంతో తిరిగి పార్వతీపురానికి బదిలీపై వెళ్తున్నారు. ఈ సందర్భంగా బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ ఎ.త్రినాథ్ ఆధ్వర్యంలో ఉద్యోగులు శ్రీరామ్మూర్తిని పూలమాలతో సత్కరించి శ్రీవేంకటేశ్వర స్వామి విగ్రహాన్ని బహూకరించి ఘనంగా వీడ్కోలు పలికారు. పలువురు వక్తలు ఆయన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ పని ఒత్తిడి ఉన్నప్పటికీ తోటి ఉద్యోగుల సహాయ, సహకారాలతో ఆరు నెలలు పనిచేయగలిగానన్నారు. టైపిస్ట్ నుంచి తహసీల్దార్‌గా ఎదిగానని చెప్పారు. ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేస్తే మంచి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పద్మనాభం మండల డిప్యూటీ తాహసీల్దార్ యోగి, ఆర్ఐ, ఇబ్రహీం, వీఆర్వోలు, వీఆర్ఏలు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.


తహసీల్దార్ శ్రీరామ్మూర్తిని సత్కరించి వీడ్కోలు పలుకుతున్న డీటీలు, ఆర్ఐ, వీఆర్వోలు

గ్రంథాలయ పితామహుడికి ఘన నివాళి

డాబాగార్డెన్స్: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో బుధవారం గ్రంథాలయ పితామహుడు, పద్మశ్రీ అయ్యంకి వెంకట రమణయ్య 134వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఇన్‌చార్జి ఉప గ్రంథాలయ అధికారి పీవీ నూకరాజు, పోలీస్ కానిస్టేబుల్ నక్కా స్వామి అయ్యంకి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఇన్‌చార్జి సహాయ గ్రంథాలయ అధికారి ఎల్.రాజేంద్రవర్మ మాట్లాడుతూ అయ్యంకి చేసిన పోరాటాల ఫలితంగానే గ్రంథాలయాలు స్థాపించబడ్డాయని, ప్రతి గ్రామానికి ఒక గ్రంథాలయం ఉండాలని ఆయన కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో పలువురు పాఠకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాలల శాఖా గ్రంథాలయంలో..

జీవీఎంసీ 36వ వార్డు పరిధి రంగిరీజువీధిలో గల బాలల శాఖా గ్రంథాలయంలో అయ్యంకి వెంకట రమణయ్య జయంతి నిర్వహించారు. జీవీఎంసీ రామచంద్ర పాఠశాల ఉపాధ్యాయురాలు కె. పార్వతి, పాఠకుడు పి. కొండలరావు పాల్గొని అయ్యంకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి టి. పోలితల్లి మాట్లాడుతూ అయ్యంకి ఆయుర్వేద వైద్యుడు, ప్రకృతి వైద్యుడే కాక సంపాదకుడిగా, గ్రంథాలయ సర్వస్వం పత్రిక స్థాపించారని, 1934, 1948 కాలంలో కోస్తాంధ్రాలో అనేక గ్రంథాలయాలు ఏర్పాటుకు కృషి చేశారన్నారు. 1992లో పద్మశ్రీ అవార్డుతో పాటు అనేక బిరుదులు సొంతం చేసుకున్నారని తెలిపారు. ప్రతి గ్రామంలో గ్రంథాలయాలు ఉన్నాయంటే ఆయన చొరవేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ పాఠకులు ఎస్.ఎల్లారావు, ఎం. అప్పారావు, రామచంద్రరావు, రాంప్రసాద్, వై. పద్మ, లక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.


జిల్లా కేంద్ర గ్రంథాలయంలో అయ్యంకి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నూకరాజు తదితరులు

పిల్లలకు క్రమం తప్పకుండా టీకాలు వేయించాలి


వెంకటేశ్వరమెట్ట గ్రంథాలయ ఆవరణలో వ్యాక్సినేషన్ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

అల్లిపురం: నియమిత సమయంలో పిల్లలకు క్రమం తప్పకుండా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని ఏఎన్ఎంలు భారతి, మదీనమ్మ తెలిపారు. వెంకటేశ్వరమెట్ట–1, బంగారమ్మమెట్ట సచివాలయాల పరిధిలో వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం బుధవారం శ్రీ వెంకట గౌరీ శంకర గ్రంథాలయం ఆవరణలో చేపట్టారు. ఈ సందర్భంగా వారు గర్భిణులు, బాలింతలను ఉద్దేశించి మాట్లాడుతూ పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు వేయడంతో పాటు తల్లిపాలు తప్పనిసరిగా పట్టించాలని సూచించారు. తల్లి పాలు తాగించడం ద్వారా పిల్లలకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు కార్యక్రమంలో ఆశ వర్కర్ అనురాధ, జీఎన్ఎంలు పాల్గొన్నారు.

లెప్రసీపై అవగాహన..

కుమ్మరవీధి సచివాలయం పరిధిలో బుధవారం ఆశ వర్కర్లు లెప్రసీపై అవగాహన కల్పించారు. ముక్కు నుంచి స్రావాలు కారడం, కంటి సమస్యలు, కండరాల బలహీనత, పాదాలపై పుండ్లు, నొప్పి తెలియకపోవడం, కనుబొమ్మలు లేదా వెంట్రుకలు లేకపోవడం, చర్మంపై లేత రంగు మచ్చలు వంటివి ఉన్నప్పుడు డాక్టరును సంప్రదించాలని ఆశ వర్కర్ పార్వతి అవగాహన కల్పించారు. దీనికి తగిన చికిత్స కూడా ఉందని వివరించారు.

హెల్మెట్ ధారణతో సురక్షిత ప్రయాణం

మద్దిలపాలెం: ద్విచక్ర వాహనంపై ప్రయాణం చేసే క్రమంలో విధిగా హెల్మెట్ ధరించాలని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ ఎం.వి.శేషమ్మ అన్నారు. హెల్మెట్ ధారణపై మద్దిలపాలెం ఆర్టీసీ డిపో వద్ద బుధవారం ఆర్టీసీ సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సురక్షితంగా గమ్యం చేరుకోవడానికి హెల్మెట్ తప్పనిసరన్నారు. విధులకు హాజరయ్యేందుకు ఇంటి వద్ద నుంచి వచ్చేటప్పుడు సిబ్బంది విధిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. కార్యక్రమంలో ప్లాపస్ చైర్మన్ వల్లభనాయుడు, ఆర్టీసీ డిప్యూటీ సీటీఎం జి.సత్యనారాయణ, మద్దిలపాలెం డిపో మేనేజర్ ఎస్.అరుణ కుమారి తదితరులు పాల్గొన్నారు.


హెల్మెట్ ధారణపై అవగాహన కల్పిస్తున్న డీఎల్ఎస్ఏ సెక్రటరీ శేషమ్మ

సీతమ్మధార రైతుబజారులో తనిఖీలు


రైతుబజారులో ధరల పట్టికను పరిశీలిస్తున్న మార్కెటింగ్ శాఖ ఏడీ యాసిన్

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజారులో బుధవారం జిల్లా వ్యవసాయ, వాణిజ్య మార్కెటింగ్ శాఖ అధికారి షేక్ యాసిన్ తనిఖీలు చేశారు. సబ్సిడీ టమాటాలు విక్రయిస్తున్న రైతుల వద్దకు వెళ్లి టమాటా నాణ్యతను పరిశీలించారు. రైతుల ఐడీ కార్డులు, కూరగాయల ధరల పట్టికను పరిశీలించి మాట్లాడారు. వినియోగదారులకు నాణ్యమైన టమాటాలు అందిస్తున్నామని యాసిన్ తెలిపారు. ప్రస్తుతం టమాటా ధర విపరీతంగా పెరగడంతో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మార్కెటింగ్ శాఖ చిత్తూరు జిల్లా నుంచి టమాటాలను లాభం, నష్టం లేని విధంగా కొనుగోలు చేసి సీతమ్మధార రైతుబజారులో అందుబాటులో ఉంచిందన్నారు. బహిరంగ మార్కెట్‌లో కన్న తక్కువ ధరకు వినియోగదారులకు నాణ్యమైన టమాటాలను విక్రయిస్తున్నట్లు చెప్పారు. ఎస్టేట్ ఆఫీసర్ కొండబాబు, సహాయకుడు సతీష్, రైతులు పాల్గొన్నారు.

పర్యావరణహితంగా జీవించాలి

ఎంవీపీ కాలనీ: పర్యావరణహితంగా జీవించడం యువత అలవరుచుకోవాలని భారత ప్రజారోగ్య సంస్థ ప్రతినిధి డాక్టర్ ఎంవీవీ మురళీమోహన్ అన్నారు. ఒడిశాకు చెందిన వ్యాస్ సంస్థ ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీలోని సమత డిగ్రీ కళాశాలలో బుధవారం వాతావరణంపై యువత చైతన్యం అంశంపై వర్క్‌షాప్ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్త జీవవైవిధ్య పరిరక్షణ ప్రకృతిపై ఆధారపడి ఉందన్నారు. భావితరాలకు కలుషితం కాని ప్రకృతిని అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. వాతావరణానికి, ప్రకృతికి హాని కలిగించని విధంగా జీవించడాన్ని యువత అలవరచుకోవాలన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

మురళీనగర్: ఏపీఈపీడీసీఎల్ జోన్–2 డివిజన్ మర్రిపాలెం సెక్షన్ పరిధి 11 కేవీ ఎఫ్‌సీఐ ఫీడర్‌లో నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ బి.కె.నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు భాస్కర్ గార్డెన్స్, ఎఫ్‌సీఐ పార్కు, శివనగర్, రామాలయం వీధి, మర్రిపాలెం వుడా లేఅవుట్, శివశివాని స్కూల్ రోడ్డు, పోలీస్ క్వార్టర్స్ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

ఎస్ఎస్‌టీఎల్ పరిధిలో..

మర్రిపాలెం: జోన్–2 ఎస్ఎస్‌టీఎల్ పరిధిలోని 11 కేవీ కళింగనగర్, శాంతినగర్ ఫీడర్ల నిర్వహణ పనుల్లో(ట్రీ కటింగ్) భాగంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ బి.కె. నాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు కళింగనగర్ ఫీడర్ పరిధిలోని మాధవ స్వామి టెంపుల్ రోడ్డు, గడ్డప్ప ఎన్‌క్లేవ్, కళింగనగర్.. శాంతినగర్ ఫీడర్ పరిధిలో అంబేడ్కర్ నగర్, శాంతినగర్, నేతాజీనగర్, గురజాడనగర్, ఎన్ఏడీ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని ఈఈ కోరారు.

రాంగ్ పార్కింగ్‌పై కొరడా

- పార్కింగ్ స్థలాల్లో నిర్మాణ పనులపై హెచ్చరించిన ట్రాఫిక్ పోలీసులు

సీతమ్మధార: వాహనాల రాంగ్ పార్కింగ్‌పై ద్వారకా జోన్ ట్రాఫిక్ పోలీసులు కొరడా ఝులిపించారు. బుధవారం డైమండ్ పార్క్ నుంచి సంగం, శరత్ థియేటర్ వరకు రాంగ్ పార్కింగ్ చేసిన వాహనదారులకు జరిమానాలు విధించారు. డైమండ్ పార్కు ఎదురుగా గల పార్కింగ్ స్థలంలో ఇసుక, సిమెంట్ వేసి నిర్మాణ పనులు చేపడుతున్న పార్లర్ యజమానిని ట్రాఫిక్ ఎస్ఐ భాస్కరరావు హెచ్చరించారు. పార్కింగ్ స్థలంలో సొంత పనులు చేయరాదని, తక్షణమే ఖాళీ చేయాలని సూచించారు. ట్రాఫిక్ సమస్య లేకుండా వ్యాపారాలు నిర్వహించుకోవాలని రోడ్డును ఆక్రమించిన టిఫిన్, తోపుడుబళ్ల వ్యాపారులతో అన్నారు. గురుద్వారా, సీతంపేట, డైమండ్ పార్కు, ద్వారకానగర్ ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వాహనాలకు సంబంధించిన పత్రాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. హెల్మెట్ ధరించాలని, రాంగ్ రూట్ ప్రయాణం ప్రమాదకరమని, మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. వాహనాలు రాంగ్ పార్కింగ్ చేస్తే జరిమానా విధిస్తామన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.


పార్కింగ్ స్థలంలో పనులు చేపడుతున్న వారిని హెచ్చరిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ భాస్కరరావు

దంత సంరక్షణతో ఆరోగ్యం

మురళీనగర్: వ్యక్తిగత ఆరోగ్యానికి దంత సంరక్షణ కీలకమని డాక్టర్ తరుణ్ అన్నారు. స్థానిక మురళీ మాధవ విద్యాలయంలో మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు శ్రీమతి సత్తి లలితారెడ్డి పర్యవేక్షణలో వీ డెంటల్, వీ హెల్త్‌కేర్ డైరెక్టర్ కె.ఎం.కె. రమేష్ సహకారంతో బుధవారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దంత సంరక్షణపై విద్యార్థులకు పలు సూచనలిచ్చారు. దంతాలను రెండు పూటలా రెండు నిమిషాల పాటు బ్రష్‌తో శుభ్రం చేసుకోవాలన్నారు. కరోనా వచ్చి తగ్గిన అనంతరం శ్వాస సంబంధిత వ్యాధులతో చాలా మంది బాధపతున్నారని, 30 ఏళ్ల దాటిన వారు శ్వాస సంబంధిత పరీక్షలు చేయించుకోవాలని చెప్పారు. 200 మంది విద్యార్థులకు దంత సమస్యలపై వైద్య పరీక్షలు నిర్వహించారు. పాఠశాల అధినేత సనపల మురళీధర్, శ్వాస ఆర్టిఫిసియల్ ఇంటెలిజెన్స్ మేనేజర్ పి.శ్రీరామ్‌మూర్తి, కార్యదర్శి సిహెచ్.లక్ష్మి, ఉపాధ్యక్షులు సిహెచ్.వరలక్ష్మి, పూర్వాధ్యక్షులు ఎం.శేషామణి, కె.మాధవి, డి.శిరీష, ఎ.రాధ, జి.లక్ష్మి, మురళీ మాధవ విద్యాలయం ప్రిన్సిపాల్ ఎస్. సత్యవతి శిబిరం నిర్వహణకు సహకరించారు.


విద్యార్థులకు దంత వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ తరుణ్

విదేశాల్లో విద్యావకాశాలపై అవగాహన


సదస్సులో పాల్గొన్న ఎస్ఏపీ మేనేజర్ మోహన్, ప్రిన్సిపాల్ సింహాద్రినాయుడు తదితరులు

డాబాగార్డెన్స్: విదేశాల్లో విద్యావకాశాలపై ఏవీఎన్ కళాశాలలో విద్యార్థులకు బుధవారం సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో రీసోర్స్ పర్సన్‌గా జర్మనీలోని సీమెన్స్ ఎనర్జీకి చెందిన ఎస్ఏపీ మేనేజర్ ఏఆర్ మోహన్ పాల్గొని అక్కడి అవకాశాలు, నిబంధనలు, కంప్యూటర్లు, విద్యా విధానంలో డిజిటలైజేషన్, పరిశ్రమల్లోని పరిస్థితుల్ని విద్యార్థులకు క్షుణ్ణంగా వివరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఎం. సింహాద్రినాయుడు, డీన్ డాక్టర్ జి. శంకరనారాయణ, భౌతికశాస్త్ర విభాగాధిపతి డి. సంతోష్‌కుమార్, జువాలజీ విభాగాధిపతి డాక్టర్ ఎ. అర్చన తదితరులు ప్రసంగించారు. తాజా సాంకేతిక పరిజ్ఞానం, భవిష్యత్‌లో విద్యార్థులు ఎదుర్కొనబోయే వివిధ సవాళ్లను వివరించారు. కార్యక్రమంలో సుమారు 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీలో ఆటో డ్రైవర్ల చేరిక

సీతమ్మధార: ఆటో డ్రైవర్లంతా సోదర భావంతో ఐక్యంగా ఉండాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పడాల గోవింద్ పిలుపునిచ్చారు. సీతమ్మధార ఏఎస్సార్ నగర్‌లోని కమ్యూనిటీ హాల్ వద్ద బుధవారం శ్రీదుర్గా గణపతి ఆటో స్టాండ్ డ్రైవర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏఐటీయూసీలో చేరిన పలువురు ఆటో డ్రైవర్లకు కండువా కప్పి ఆహ్వానించారు. గోవింద్ మాట్లాడుతూ డ్రైవర్లు ఖాకీ యూనిఫారం ధరించాలని, ఆటోల ఫిటినెస్ సర్టిఫికెట్ పక్కాగా ఉండాలని, ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించకూడదని సూచించారు. ప్రయాణికులతో మర్యాదగా ప్రవర్తించాలని, మద్యం తాగి ఆటో నడపరాదన్నారు. నగరంలోని ఆటోలకు పార్కింగ్ స్థలాలు, పీఎఫ్, ఈఎస్ఐతో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటుకు డ్రైవర్లందరూ పోరాటాలకు సిద్ధమవ్వాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చంటి, నాని, రవీంద్రరెడ్డి, గణేష్, రాజ్ కుమార్, నాయుడు, సన్నీ, డీజే, రెడ్డి పాల్గొన్నారు.


ఏఐటీయూసీలో చేరిన ఆటో డ్రైవర్లకు కండువా వేస్తున్న పడాల గోవింద్

బడ్జెట్‌లో 'ఉక్కు'కు తీరని అన్యాయం

అగనంపూడి: కేంద్ర బడ్జెట్‌లో విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు తీరని అన్యాయం చేసిందని సిటూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 1259వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో పాల్గొన్న నరసింగరావు మాట్లాడుతూ కూటమిలో ఉన్నప్పటికీ బీజేపీ ఏమాత్రం సాయం చేయకుండా విశాఖ ఉక్కుకు, రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిందన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని, పూర్తి సామర్థ్యంతో కర్మాగారం నడిచేలా బడ్జెట్ సహకారం అందివ్వాలని, ఉక్కుకు సొంత గనులు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర ఉక్కు మంత్రి కుమారస్వామి ఉక్కును సందర్శించిన సమయంలో ఉక్కును ఆదుకుంటామని హామీ ఇచ్చారని, నెలరోజులు తిరగకముందే ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో మొండిచేయి చూపడం దారుణమని అన్నారు. బీజేపీ తన పాత విధానాలనే కొనసాగిస్తోందని, ప్రభుత్వరంగ సంస్థలను అమ్మేయడం ద్వారా ఆదాయం రాబట్టాలనే కుట్రలను కొనసాగిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ భాగస్వామ్య పక్షాలుగా ఉన్న టీడీపీ, జనసేన ఈ విషయంలో మేల్కొని విశాఖ ఉక్కు పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కును ప్రైవేటీకరించబోమని ప్రకటించే వరకు ఉద్యమాలు ఆపేది లేదన్నారు. స్టీల్ సిటూ అధ్యక్షుడు వై.టి.దాస్, ఎన్.రామారావు, శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.